పెరిగిన మెస్‌చార్జీలతో విద్యార్థులకు పౌష్టికాహారం



విద్యార్థులతో మాట్లాడుతున్న బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: పెరిగిన మెస్‌చార్జీలతో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఎస్సీ ప్రభుత్వ కళాశాలలో పెరిగిన మెస్‌చార్జీల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ రామకృష్ణ మెనూ చదివి వినిపించారు. తనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంక, ఏఈఈ రాజ్‌కుమార్ తదితరులున్నారు.

'రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే'

మణికొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చలేక కాంగ్రెస్ ప్రభుత్వం దివాలా తీసిందని, రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి. కార్తీక్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, లాలమ్మ గార్డెన్‌లో బొడ్డు శ్రీధర్ ఆధ్వర్యంలో పలువురు ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు రాష్ట్రంలో ఏ ఒక్కటీ నెరవేర్చలేక పోయారన్నారు. రైతు భరోసా, పింఛన్ లాంటి ఎన్నో పథకాలు లబ్ధిదారులకు దూరమయ్యాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అందే పథకాలు ప్రజలకు అందకపోవటంతో వారంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై నిట్టూర్పుతో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, ప్రస్తుత పాలకులు అందులో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డిలతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

మణికొండ: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై చిన్ననాటి నుంచే అవగాహన పెంచుకోవాలని శరణ్య ఫౌండేషన్ ఫౌండర్ దివ్యమేన అన్నారు. మణికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ప్రొజెక్టర్ సహాయంతో అవగాహన కల్పించారు. అలాగే పరిసర ప్రాంతాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, స్వచ్ఛమైన గాలి, నీరు భూమి రక్షణ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దివ్యమేన మాట్లాడుతూ భావితరాలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ పూసాల సత్యనారాయణ, హెడ్ మిస్ట్రెస్ ప్రమీల, ఉపాధ్యాయులు అమల, రేణుక, ఫాతిమా, వాలంటీర్లు శృతి, ప్రేజి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,285 కేసుల పరిష్కారం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 2,285 కేసులను పరిష్కరించారు. ఇందులో రాజీపడిన కేసులు 155, అడ్మిషన్ కేసులు 341, డ్రంకన్ డ్రైవ్ కేసులు 840, ఇ-పెట్టి కేసులు 549, విద్యుత్ చౌర్యం కేసులు 169, సైబర్ క్రైమ్ 231 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్ కిరణ్, 13వ అదనపు న్యాయమూర్తి అంకిత్ సర్వ, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్, ఏపీపీలు ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, లోక్ అధాలత్ సభ్యులు సుదర్శన్, సుధాకర్ రెడ్డి, సుజాత, వరప్రసాద్, శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది రవీందర్, వెంకటరంగారెడ్డి, భాస్కర్, నరేశ్ గౌడ్, సంబంధిత శాఖాల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

మణికొండ: అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో ఉంటున్న వారికి అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలని, అప్పుడు జాగ్రత్తలు పాటిస్తారని మాదాపూర్ అగ్నిమాపక అధికారి ఫజల్ అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్, ఎంజీ పార్కులో అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఉన్న అవకాశాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రాణనష్టం, ఆస్తినష్టం తదితర అంశాలపై ఆయన వివరించారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఎట్టి పరిస్థితిలోనూ లిఫ్టులను ఉపయోగించొద్దన్నారు, అగ్నిమాపక శాఖ వారి అనుమతి ఉన్న ఫ్లాట్‌ల్లోనే ఉండాలని సూచించారు. ఇటీవల మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని రెండు అపార్ట్‌మెంట్‌లలో అగ్ని ప్రమాదాలు జరిగాయన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్ అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో ప్రజలను జాగృతం చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.

గొర్రె కాపర్లు, కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న యెగ్గె మల్లేశం

మణికొండ: రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉన్న గొర్రె కాపర్లు, కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయటంతోపాటు సహకార సంఘానికి కురుమ వ్యక్తినే చైర్మన్‌గా నియమించాలని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. శనివారం కోకాపేటలో కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గొల్లలతో తమకు కలవపద్దని, తమకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలన్నారు. ఒగ్గు కళాకారులకు ఆ విద్య తప్ప మరేదీ రాదని, వారిని రాష్ట్ర సాంస్కృతిక మండలిలో స్థానం కల్పించి వారికి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కోకాపేటలో నిర్మించిన వసతి గృహంలో ప్రభుత్వం తరఫున ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తే పేద విద్యార్థులకు ఉచిత విద్య అందుతుందన్నారు. భవనానికి మిగిలి ఉన్న ప్రహరీగోడ నిర్మాణ పనులకు నిధులను కేటాయించాలన్నారు. రాబోయే అన్ని ఎన్నికల్లో కురుమలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని కోరారు.

ఓటు బ్యాంకుగా చూశారు...

గత ప్రభుత్వం గొల్ల, కురుమలను ఓటు బ్యాంకుగానే చూసిందని గొర్రెలు, బర్రెలను మేపుకునే బతకాలని పథకాలను తెచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. అదే కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో కురుమలకు రెండు, గొల్లలకు రెండు ఎమ్మెల్యే స్థానాలను ఇచ్చి గౌరవించిందన్నారు. గత ప్రభుత్వంలో గొర్రెల కోసం డీడీలు కట్టిన వారు నిరీక్షిస్తున్నారని, వారికి ముఖ్యమంత్రి త్వరలోనే న్యాయం చేస్తారన్నారు. కురుమలకు కార్పొరేషన్ ఇచ్చి నిధులు ఇవ్వాలని కోరారు. వరంగల్‌లో నిర్మించే ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరుతో నిర్మించాలని రాజకీయ విశ్లేషకుడు కంచె ఐలయ్య సూచించారు. కురుమలను బీసీబీ నుంచి బీసీఏ లోకి మార్చాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉందని, దాన్ని రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ఆలీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కర్ణాటక ప్రభుత్వ సలహాదారు రేవన్న, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, వీర్లపల్లి శంకర్, శాసనమండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బొగారం దయానంద్, టీపీసీసీ అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి, నాయకులు క్యామ మల్లేష్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో నవగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, దృగ్బలి, పూర్ణాహుతి కార్యక్రమాలతో పాటు చండీహోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై. సురేష్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి సంజయ్ (బంటి), ఉపాధ్యక్షులు బూడిద రమేష్, గణేష్, కాలనీ వాసులు నానం వెంకటేష్, చప్పిడి దిలీప్, శ్రావణ్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, సుధీర్, టింకు, బాబులాల్, వంసత యాదగిరి, బండిరాజు, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

మణికొండ: దేశంలో సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, భావితరాలను దాన్ని అందించేందుకు చేయాల్సిన కృషిపై ఆదివారం సనాతన హిందూధర్మ పరిరక్షణ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మణికొండ మర్రిచెట్టు సమీపంలోని శివాలయంలో ఉదయం 9గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, ఇందులో పలువురు పీఠాధిపతులు, హిందూ ధర్మ పరిరక్షకులు, పలు సంస్థల ప్రతినిధులు హాజరువుతున్నారని, హిందువులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అంబులెన్స్‌లోనే ప్రసవం

శంషాబాద్: అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగిన సంఘటన శంషాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేశంపేట మండలం లేమామిడి గ్రామానికి చెందిన శ్వేతకు పురుటినొప్పులు రావడంతో శనివారం సాయంత్రం 108 అంబులెన్స్‌లో నిలోఫర్‌కు తీసుకెళుతున్నారు. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువకావడంతో ఈఎంటీ కిషన్ ఆధ్వర్యంలో ప్రసవం చేశారు. ఆడబిడ్డ పుట్టడంతో తల్లిశిశువును శంషాబాద్‌లో ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు.

17నుంచి సింపోజియం ఆఫ్ వెటర్నరీ పారాసిటాలజీ



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న శరత్‌చంద్ర

ఏజీవర్సిటీ: నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ వెటర్నరీ పారాసిటాలజీ 2024 కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి19 వరకు రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ శరత్‌చంద్ర తెలిపారు. శనివారం పశువైద్య విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సింపోజియం ప్రధాన లక్ష్యం జంతు, మానవ ఆరోగ్యంతోపాటు పరాన్న జీవులపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో పరిశోధకులు, వెటర్నరీ డాక్టర్లు , పశువైద్య నిపుణులను ప్రోత్సహిస్తూ పరాన్నజీవుల వల్ల వచ్చే ఇబ్బందులు, తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరిస్తారని తెలిపారు. అలాగే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా రైతుల నుంచి తెలుసుకొని భవిష్యత్‌లో ఎలాంటి పరిశోధనలు చేయాలని వాటిపైన మూడురోజులపాటు చర్చ జరగడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేట్ డీన్ ఉదయ్‌కుమార్ సత్యనారాయణరాజు, సురేష్, విజయ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 సెల్‌ఫోన్లు చోరీ

శంషాబాద్ రూరల్: అయ్యప్ప సన్నిధానంలో రాత్రిపూట గుర్తుతెలియని వ్యక్తులు 12 సెల్‌ఫోన్లను చోరీ చేశారు. మండలంలోని మల్కారంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులోని ఆంజనేయస్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములు సన్నిధానం ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి పూజలు అనంతరం 17 మంది స్వాములు నిద్రపోయారు. ఈ క్రమంలో తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు 12 సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. గమనించిన బాధితులు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వసతులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలి

వాణిజ్యపన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వి



గరిట కలుపుతున్న రిజ్వి, ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఏ. ఎం. రిజ్వి అన్నారు. 40శాతం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న వసతులుపై ఆరా తీయడంతో పాటు డైట్‌మెను పక్కాగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంట తీరును పరిశీలించడంతోపాటు విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



వేం నరేందర్‌రెడ్డితో కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం కొండకళ్ల నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా పాటు పడతారన్నారు. యువజన కాంగ్రెస్‌ను రంగారెడ్డి జిల్లాలో మరింత బలోపేతం చేస్తానన్నారు. అందరిని కలుపుకుంటూ ముందుకుసాగుతూ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, రాజన్, శ్రీహరిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ముస్తాఫ్, షబాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



రాజేంద్రనగర్: బుద్వేల్‌లో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి నూతన కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. సేవా సమితి అధ్యక్షుడిగా బి.దేవేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎస్.చెన్నారెడ్డి, ఆర్.రాకేశ్‌గౌడ్, కె.నరేశ్ గౌడ్, ఎం.నాగార్జున గౌడ్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.ఇంద్రాసేన రెడ్డి, జాయింట్ సెక్రటరీగా పి.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా బి.అనిల్ రెడ్డి, ఆర్గనైజర్లుగా డి.రాజు యాదవ్, కె.సాయిరాం గౌడ్, ఆర్.ధన్‌రాజ్, జి.హరికిరణ్ గౌడ్, వి.వెంకట్ రెడ్డి, జి.నిఖిల్ కుమార్, జి.నర్సింహ, కార్యవర్గ సభ్యులుగా ఎం.నాగరాజ్, డి.రాజ్‌కుమార్ యాదవ్, డి.జగదీశ్ యాదవ్, పి.మోహన్, సీహెచ్.సత్యసాయిరాం గౌడ్‌లు ఎన్నికయ్యారు.

దైవచింతనతో ముందుకుసాగాలి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి ఒక్కరూ దైవచింతనతో ముందుకుసాగాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం గొల్లపల్లి, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్షను నిర్వహించడంతో సన్నిధానం స్వాములు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

డైట్ మెనూ ప్రారంభం



డైట్ మెనూ ప్రారంభోత్సవంలో తాఫ్సీర్ ఇక్బాల్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బైరాగిగూడలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఎడ్యుకేషన్ సొసైటీలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ టీఎంఆర్ఐఎస్ స్పెషల్ సెక్రటరీ తాఫ్సీర్ ఇక్బాల్, అసిస్టెంట్ సెక్రటరీ యూసుఫ్ ఆలీ, మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌లు హాజరై విద్యార్థులకు అందించే మెనూ వివరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల ఎంఈవో విజయ్‌కుమార్, కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు సకల సౌకర్యాలు

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్



నార్సింగి గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న అరవింద్‌కుమార్



కొత్త మెనూను ప్రారంభిస్తున్న అరవింద్‌కుమార్

మణికొండ: హాస్టల్‌లలో చదువుకుంటున్న విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని, విద్యార్థులు ఆనందంగా చదువుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ అన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలలో ఆయన కొత్త మెనూ, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులు, తల్లితండ్రులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని అన్ని తరగతి గదులు, స్టోర్‌రూం, కిచెన్, వాష్‌రూంలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులు వారి తల్లితండ్రులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందించాలనే ఉద్దేశంతోనే గురుకుల పాఠశాలలను కొనసాగిస్తుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యాబోధనతో వారు రాణించాలన్నారు. అనంతరం విద్యార్థినులు నేర్చుకుంటున్న బాక్సింగ్‌ను ఆయన ఆసక్తిగా చూశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం. నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మెప్మా పీడీ మల్లేశ్వరి, ప్రిన్సిపాల్ సుజాత, మున్సిపల్ డీఈ నరేష్, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో జనరంజక పాలన

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో చేరుతున్న నాయకులు

మణికొండ: సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో జనరంజక పాలన సాగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బుద్దోళ్ల కావ్య శ్రీరాములు, శైలజ వినోద్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపించిందన్నారు. రాష్ట్రంలో జన రంజకమైన ప్రజాపాలనతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ఉచిత బస్సు, ఉచిత కరెంటు, విద్యా, ఆరోగ్య, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు వంటి అన్ని పథకాలను అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు చేరువడంతో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దత్తాత్రేయను పూజిస్తే సకల దోషాలు తొలగుతాయి



దత్తాత్రేయ జయంతిలో తోకల శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: దత్తాత్రేయను పూజిస్తే సకల దోషాలు తొలగిపోతాయని, హిందూ పురాణాల ప్రకారం దత్తాత్రేయకు ఎంతో ప్రాముఖ్యత ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లో దత్తాత్రేయ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ పురాణం ప్రకారం త్రిమూర్తుల స్వరూపమే దత్తాత్రేయ అని అన్నారు. దత్తాత్రేయను పూజిస్తే సకల సంపదలు కలుగుతాయని పేర్కొన్నారు. ఇంత మంచి పూజా కార్యక్రమంలో తాను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేశవ పంతులు, శ్రీనివాస్, పవన సాయి, లంకల సాయిరెడ్డి, ఉదయ్, దినేష్, కిరణ్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

శోభాయమానంగా రాధా గోవింద రథయాత్ర



రథంపై ఊరేగిన రాధా కృష్ణులు

మణికొండ: సాంస్కృతిక వైభవం, ఆధ్యాత్మికత, సమైఖ్యతల సమ్మేళనంగా కోకాపేటలో శ్రీ రాధా గోవింద రథయాత్రను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట వై జంక్షన్ నుంచి శ్రీ కృష్ణ గోసేవ మండలి గోశాల వరకు రథయాత్రను శోభాయమానంగా కొనసాగించారు. అత్యంత సుందరంగా అలంకృతులైన రాధా గోవిందులను భక్తులు హారతుల, భజనలు, కోలాటాలు, సంకీర్తనలతో ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ చెన్నై అధ్యక్షుడు స్తోక కృష్ణ మహారాజ్, అక్షయ పాత్ర తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాసులు ప్రారంభించారు. రథయాత్ర పొడవునా భక్తులు పెద్ద ఎత్తున రథాన్ని లాగేందుకు ప్రయత్నించారు. 500 మంది ఏకకాలంలో రథాన్ని లాగేలా ఏర్పాట్లు చేయటంతో భక్తులందరికీ అవకాశం దక్కింది. రోడ్లపై అందమైన రంగోళిలు, నాటక ప్రదర్శనలు, నృత్య ప్రదర్శనలు, కోలాట నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం హరేకృష్ణ కార్నివాల్‌లో ఆకర్షణీయమైన గేమ్‌లు, మనోహరమైన సంగీతం ఆకర్షించాయి.



రాధా కృష్ణులకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు